# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశ విభిన్న భాషలు, సంప్రదాయాలను ప్రతిబింబించడంలో చలన చిత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ ఖచ్చితమైన నీటి వినియోగంతో పాటు.. దానిని సంరక్షించాల్సిన భాధ్యత అందరిపై ఉందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.
- ❖ మాదకద్రవ్య రహిత భారతావని నిర్మాణానికి కేంద్రంతో పాటు రాష్ట్రాలు సమర్ధవంతంగా పని చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ రాబోయే దశాబ్దాలలో ప్రపంచ ఇంధన డిమాండ్‌కు భారతదేశం ఒక ముఖ్యమైన చోదక శక్తిగా నిలుస్తుందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు.
- ❖ ఆసియా క్రీడల్లో భారత మహిళా క్రికెట్ జట్టు తొలి స్వర్ణ పతకాన్ని సాధించింది.

======================

భారతదేశ విభిన్న భాషలు, సంప్రదాయాలు, సామాజిక అనుభవాలను ప్రతిబింబించడంలో చలన చిత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను రాష్ట్రపతి ఈ సాయంత్రం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చలనచిత్రాలు ప్రేక్షకులను అలరించడమే కాకుండా.. విభిన్న ప్రాంతాల ప్రజలను కలుపుతాయన్నారు. భారతదేశపు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడంలో చలన చిత్రాలు సహాయపడతాయని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్.. విజేతలకు అభినందనలు తెలియజేస్తూ... తెర వెనుక పనిచేస్తున్న సాంకేతిక నిపుణులు, సినిమాటోగ్రాఫర్లు ఇతర సభ్యుల కృషిని ప్రశంసించారు. భవిష్యత్‌లో జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వీలుగా తమ తమ ప్రాంతాలలో ఒక ముఖ్యమైన పర్యాటక ప్రదేశాన్ని గుర్తించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అశ్వినీ వైష్ణవ్ ఆహ్వానం పలికారు.

========================

ఖచ్చితమైన నీటి వినియోగంతో పాటు.. దానిని సంరక్షించాల్సిన భాద్యత అందరిపై ఉందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. 9వ `భారత అంతర్జాతీయ జల వారోత్సవాలు-2026`ను ఉపరాష్ట్రపతి న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నీటి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించడానికి సంబంధిత వర్గాలన్నింటినీ ఒకచోట చేర్చేందుకు జల వారోత్సవాలు ఒక ముఖ్యమైన వేదిక అని ఉద్ఘాటించారు. నీటికి సంబంధించిన సవాళ్లను ఏ ఒక్క సంస్థ, రంగం లేదా రాష్ట్రం ఒంటరిగా పరిష్కరించలేవని, అందుకోసం మరింత సహకారం, సమన్వయ విధానం అవసరమని పిలుపునిచ్చారు. జలవనరుల సుస్థిర, సమర్థవంతమైన నిర్వహణను నిర్ధారించడానికి ఇటువంటి సహకారం, పరిపాలనా, భౌగోళిక సరిహద్దులను దాటి విస్తరించాలని ఉపరాష్ట్రపతి అన్నారు. నీటి నిర్వహణకు సంబంధించిన సమగ్ర విధానంలో భాగంగా నదీ పరివాహక ప్రాంతాల నిర్వహణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, వర్షపు నీటి సేకరణ, సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థలు కలిసి పని చేయాలని రాధాకృష్ణన్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ... దేశంలోని ప్రతి పౌరునికి సురక్షితమైన, సరిపడా తాగునీటిని అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

========================

నీటి భద్రత అనేది ఒక ఉమ్మడి బాధ్యత అని, దీనికి పటిష్టమైన వ్యవస్థలు, శాస్త్రీయ పరిష్కారాలు, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి సామాజిక మధ్యమం వేదికగా పంచుకుంటూ... పంచుకుంటూ... జల్ జీవన్ మిషన్, నమామీ గంగే, నీటి సంరక్షణ, సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా వాతావరణ మార్పులను తట్టుకోగల నీటి నిర్వహణను నిర్మించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలపై సి.ఆర్. పాటిల్ ఈ వ్యాసాన్ని రాశారని తెలిపారు. రాష్ట్రాలు, వివిధ వర్గాల వ్యాప్తంగా నిరంతర ప్రయత్నాలతో పాటు ప్రజల భాగస్వామ్యం, భవిష్యత్ తరాలకు సుస్థిర పద్ధతిలో నీటిని ఎలా అందించగలదనే దానిపై ఈ వ్యాసం ఒక లోతైన దృక్పథాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

========================

బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు దిగకుండా.. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని, బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈనెల 28 నుంచి 30 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులలోని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, మరికొన్ని యూనియన్లు, అసోసియేషన్లు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ విజ్ఞప్తి చేసింది. ఐదు రోజుల బ్యాంకింగ్ అమలు, పనితీరు ఆధారిత ప్రోత్సాహక (PLI) పథకాన్ని ఉపసంహరించుకోవడం అనే రెండు ప్రధాన డిమాండ్లకు మద్దతుగా బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారు. అయితే వివరణాత్మక చర్చల అనంతరం, డిమాండ్లలో ఒకదానిని నెరవేరుస్తూ.. పీఎల్ఐ పథకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

విరామం

========================

రాబోయే దశాబ్దాలలో ప్రపంచ ఇంధన డిమాండ్‌కు భారతదేశం ఒక ముఖ్యమైన చోదక శక్తిగా నిలుస్తుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్) - ఇండియా ఎనర్జీ డైలాగ్ 7వ ఉన్నత స్థాయి సమావేశాన్ని ఒపెక్ సెక్రటరీ జనరల్ హైతమ్ అల్ ఘైస్‌తో కలిసి ఆయన సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ... భారత్, ఒపెక్ సభ్య దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు కీలక ఇంధన సమస్యలపై.. పరస్పర అవగాహన, సహకారానికి గణనీయంగా దోహదపడ్డాయని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. ప్రపంచ ఇంధన మార్కెట్లలో స్థిరత్వం, పారదర్శకతను ప్రోత్సహించడానికి, సమతుల్యమైన, స్థిరమైన ప్రపంచ ఇంధన మార్కెట్‌ను అభివృద్ధి చేయడంలో ఒపెక్, భారత్ కలిసికట్టుగా పని చేయాలని హర్దీప్ సింగ్ పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమాన అనుసంధానాన్ని ముందుకు నడిపించే అత్యంత విప్లవాత్మక పథకాలలో `ఉడాన్` పథకం ఒకటని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం తదుపరి దశ కింద.. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈరోజు న్యూఢిల్లీలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో అవగాహన ఒప్పందాలపై (MoU) సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ పథకాన్ని మరో 10 సంవత్సరాల పాటు పొడిగించిన అనంతరం.. దేశవ్యాప్తంగా 100 కొత్త విమానాశ్రయాలు, 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. రాబోయే దశలో ఉడాన్ 4 కోట్ల మంది ప్రయాణికులకు ప్రయాణ సౌకర్యాలను కల్పించనుందని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్య రహిత భారతావని నిర్మాణానికి కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా సమర్ధవంతంగా పని చేయాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే 3వ జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్సు (ANTF) అధిపతుల సదస్సును ఆయన ఈరోజు ప్రారంభించారు. ఏకీకృత సంకల్పం, ఉమ్మడి బాధ్యత అనే ప్రధాన ఉద్దేశ్యంతో ఈ రెండు రోజుల సదస్సు నిర్వహిస్తుండగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డిజిపిలు వర్చువల్ గా ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... యువతను మాదకద్రవ్యాల బారి నుండి కాపాడేందుకు `విజన్ డాక్యుమెంట్ ఆన్ నార్కోటిక్స్ కంట్రోల్ (2026-29)` నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రంతో కలసి పని చేయాలని సూచించారు. వీటి ప్రభావం యువతపై పడకుండా నిరోధించడం, అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అడ్డుకోవడం, దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర-రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలు ఈ సదస్సులో కీలకంగా నిలవనున్నాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు తొలి స్వర్ణ పతకాన్ని సాధించింది. జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చురల్ కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 147 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక 69 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత్ స్వర్ణ పతాకాన్ని కైవసం చేసుకుంది. కాగా ఆసియా క్రీడల్లో భాగంగా అతిధ్య జట్టు జపాన్‌తో జరిగిన తొలి టీ-20 మ్యాచ్‌లో భారత పురుషుల క్రికెట్ జట్టు విజయం సాధించింది. వర్షం కారణంగా 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో.. జపాన్ పై భారత జట్టు 2 పరుగుల తేడాతో గెలుపొందింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =